స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- యండగండిలో ఓహెచ్ఎస్ఆర్, ఫిల్టర్‌బెడ్ సంపుల నిర్మాణానికి శంకుస్థాపన


యండగండిలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఉండి: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. ఆదివారం యండగండి గ్రామంలోని రెండో సచివాలయ పరిధిలో గ్రామ సర్పంచ్ గోగుల మండ చినకృష్ణమూర్తి ఆధ్వర్యంలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.64 లక్షల వ్యయంతో వాటర్ ట్యాంక్ (ఓహెచ్ఎస్ఆర్), ఫిల్టర్ బెడ్, సంపుల నిర్మాణానికి పీవీఎల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చినకృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పీవీఎల్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని 70 గ్రామాల్లో ప్రజలకు ఎప్పుడు ఏది అవసరమవుతుందో ముందే తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. అలాగే ఇతర సమస్యలను గ్రామ వలంటీర్లు, సచివాలయ అధికారుల ద్వారా వాటిని గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతున్నామన్నారు. ఆ వెంటనే వాటి పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పరిష్కరిస్తున్నామన్నారు. దీనిలో భాగంగానే గ్రామాల్లో అవసరమైన మేరకు వాటర్‌ట్యాంక్‌లు, ఫిల్టర్‌బెడ్‌లు, పైపులైన్ విస్తరణ, శివారు ప్రాంతాలకు తాగునీటి సరఫరా వంటివాటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అంతే కాకుండా జగనన్న లేఅవుట్లలో నిర్మాణమైన ఇళ్లకు కూడా తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలపై అధికారులు అప్పటికప్పుడు పరిష్కార మార్గాలు చూపిస్తున్నారని అన్నారు. సీసీ రోడ్లు, పక్కా డ్రెయిన్లు నిర్మాణం చేసి గ్రామాలను గత ప్రభుత్వాల కంటే అత్యున్నతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ సెంటర్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణంతో గ్రామాలకు కొత్త రూపు వచ్చిందన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి గోస్తనీ తీర్థోత్సవాలు

పాలకోడేరు: శ్రీ గోస్తనీ నది 92వ తీర్థోత్సవాలను మంగళవారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా 31వ తేదీ ఉదయం నుంచి ఏకాహం, భజనలు జరుగుతాయన్నారు. 1వ తేదీ ఉదయం నుంచి అల్లూరి సీతారామరాజు కుటుంబ సభ్యులతో కోదండరామ కల్యాణం , శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం, 10 గంటలకు కోలాటం, 11 గంటలకు అన్న సమారాధన రాత్రి 8 గంటలకు శ్రీ అల్లూరి సీతారామరాజు సినిమా ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.

నేడు శునకాలకు టీకాలు

ఉండి: పశుసంవర్ధకశాఖ, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉండి ప్రాంతీయ పశువైద్యశాలలో సోమవారం ఉదయం పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేస్తున్నట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆదివారం చెప్పారు. ఈ సందర్భంగా జంతు సంక్షేమం, కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ, టీకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పాలకొల్లు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నాగదేవి


నాగదేవి

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు ఇన్‌చార్జ్ తహశీల్దార్‌గా కట్టా నాగదేవి బాధ్యతలు స్వీకరించారు. పాలకొల్లు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నాగదేవి డిప్యుటేషన్‌పై నరసాపురం ఎలక్షన్ డీటీగా బాధ్యతలు స్వీకరిస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమించినట్లు ఆదివారం విలేకరులకు నాగదేవి తెలిపారు. ఇప్పటివరకూ తహసీల్దార్‌గా పని చేసిన జి.మమ్మి పదోన్నతిపై ఒంగోలు డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

పుంతలో ముసలమ్మ ఆలయంలో అన్నదానం


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక రామగుండం పార్క్ వద్ద సంక్రాంతి పండుగలో నిర్వహించిన శ్రీ పుంతలోముసలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఇటీవల ముగిశాయి. ఈ నేపథ్యంలో ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పిన్ని ఉప్పరి, పిన్ని వేణుగోపాలస్వామి, కమిటీ సభ్యులు గజ్జరపు రాజా, వంకా రామకృష్ణ, నేదునూరి సూరిబాబు, పేర్ల రాము, వైఎస్సార్ సీపీ నాయకులు చెన్ను విజయ్, రేలంగి శ్రీను, గంటా నరేష్, తలువూరి భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

కేపీ పాలెం బీచ్‌లో పూర్వ విద్యార్థుల సందడి


కొబ్బరితోటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న వట్టం గణేష్

మొగల్తూరు: పాలకొల్లు బీఆర్ఎంవీఎల్‌హెచ్ స్కూల్‌లో 1981లో విద్యనభ్యసించిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కేపీ పాలెం బీచ్‌లో కలుసుకున్నారు. చిన్ననాటి ముచ్చట్లను నెమరవేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం ఏర్పాటు చేసుకున్న సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వట్టం గణేష్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సామాజిక, ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టేందుకు మీరంతా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కంకిపాటి సాంబశివరావు, నిట్ట రమేష్, పిల్లా శ్రీనివాస్, ఆర్‌వీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బల్ల పూజలు


రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరు, గవరపేట రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బల్లపూజలు ఆదివారంతో ముగిశాయి. దీనిలో భాగంగా పై గ్రామాలకు చెందిన రజకులు గ్రామోత్సవం నిర్వహించారు. కాలువలోనూ, చెరువులోను ఉపయోగించే బల్లలకు ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు. సంఘ అధ్యక్షుడు ఆదుర్తి శివరావు, ఉపాధ్యక్షుడు దేవాడ నీలవెంకటేశ్వరరావు, అంతర్వేదిపాలెం ఛాముండేశ్వరరావు, లంకా నరసింహమూర్తి, పొలిమేర సాయి, దేవాడ లక్ష్మణేశ్వరరావు, సంఘసభ్యులు, మహిళలు, యువ జనులు పాల్గొని బల్లలకు ప్రత్యేక పూజలు చేశారు.

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం



ఆదిలక్ష్మి అమ్మవారి సన్నిధిలో భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
శ్రీదుర్గాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): అమ్మవార్ల సన్నిధిలో భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రజక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గునుపూడి గ్రామ దేవతలు ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్ల 32వ జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. జాతర ముగింపు సందర్భంగా ఆదివారం అమ్మవార్ల ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. అనంతరం అన్నసమారాధనను ప్రారంభించి భక్తులకు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారన్నారు. అలాగే భక్తులకు అమ్మవారి ప్రసాదం అందించడం చాలా మంచి కార్యక్రమం అన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని, అమ్మ దయతో అందరూ బాగుండాలని ఆకాంక్షించారు. అన్నసమారాధన దాత గొట్టుముక్కల వెంకటలక్ష్మి, తోట భోగయ్య, ఆలయ ఈవో జీఎన్ సీతారామరాజు, ఆలయ ధర్మకర్తలు, రజక యూత్ అసోసియేషన్, శ్రీ ఆదిలక్ష్మి రజక సంఘం నాయకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీదురాలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవాలు ప్రారంభం

డీఎన్నార్ కళాశాల రోడ్డులోని కాలువ గట్టుపై వెలిసిన శ్రీదుర్గాలక్ష్మి అమ్మవారి 45వ వార్షికోత్సవాలను ఆదివారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవారాధన మించిన అనుభూతి మరొకటి లేదన్నారు. శ్రీదుర్గాలక్ష్మి అమ్మవారి వార్షిక మహోత్సవాలను ఏటా మాదిరిగానే ఘనంగా నిర్వహించాలన్నారు. అమ్మవారిని దర్శించుకునే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ ధర్మకర్తలు, అర్చకులు సత్కరించి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో గొట్టుముక్కల సీతారామరాజు, చైర్మన్ పిప్పళ్ల సూర్యారావు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు వాకా ఉదయ్‌కుమార్, తాడి వెంకటేశ్వరరెడ్డి, గండికోట వీరాస్వామి, పార్టీ నాయకులు రేవూరి గోగురాజు, తోట భోగయ్య, ముల్లి నరసింహమూర్తి, మానేపల్లి నాగేశ్వరరావు, గాదిరాజు సుబ్రహ్మణ్యంరాజు, కైలా పాండురంగారావు, ముత్యాల బుజ్జి, కోయ శ్రీరామమూర్తి, ఏపీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ప్రాతళ్లమెరకలో గడపగడపకు మన ప్రభుత్వం

కాళ్ల: ప్రాతళ్లమెరక గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆదివారం చెప్పారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొనాలన్నారు.

నేడు మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాలు

సాక్షి, భీమవరం: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో సోమవారం కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం తెలిపారు. గాంధీ విగ్రహాల వద్ద సర్వమత ప్రార్థనలు, శాంతి ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. అదే విధంగా పెదనిండ్రకొలను మహాత్మాగాంధీ భవనంలో 11 గంటలకు గాంధీ మ్యూజియాన్ని ప్రారంభించి గాంధి జీవిత అంశాలపై ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. మల్లవరం ఆనంద్ నికేతన్ గాంధీ ఆశ్రమంలో గాంధేయంపై కవితా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

1 నుంచి సత్యదేవుడి కల్యాణోత్సవాలు

వీరవాసరం: నవుడూరులో వేంచేసియున్న శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో వార్షిక కల్యాణ మహోత్సవాలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కల్యాణోత్సవాల నిర్వాహకులు ఆదివారం చెప్పారు. 1వ తేదీన స్వామి అమ్మవార్ల కల్యాణం, ఉదయం 10 గంటల నుంచి అఖండ అన్నసమారాధన చేపడతామన్నారు. 2వ తేదీన స్వామివార్లకు విశ్వక్సేన పూజ, హోమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 3వ తేదీన శ్రీపుష్ప యాగోత్సవం, స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించి తరించాలని కోరారు.

శాకాహారమే అమృతాహారం


శాకాహార ర్యాలీని నిర్వహిస్తున్న ధ్యానులు

నరసాపురం రూరల్: శాకాహారమే అమృతాహారమని, శాకాహారం తీసుకుని ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సీనియర్ మాస్టర్‌లు మేకా వెంకటేశ్వరరావు, పెద్దివర్మలు అన్నారు. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆఫ్ ఇండియా నరసాపురం శాఖ ఆధ్వర్యంలో వైఎన్ కళాశాలలో నిర్మించిన మెర్కెబా పిరమిడ్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన మహాకరుణ శాకాహార ర్యాలీలో వారు పాల్గొని మాట్లాడారు. ధ్యానం వల్ల ఏకాగ్రత కలుగుతుందని, మానసిక ఆందోళనను విడిచి ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు శాకాహారం తినడం వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు, మాంసాహారం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. తొలుత పట్టణంలోని ప్రధాన రహదారులతోపాటు రాయపేట, రుస్తుంబాద ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహిచారు. కార్యక్రమంలో కేవీ శైలజ, తాడిమేటి కృష్ణవేణి, భాస్కరరావు, కేవీడీ ప్రసాద్, ఆగర్తిపాలెం నాగశ్రీను, అమలాపురం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని యడ్లబజారు సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీ సీతారామ లక్ష్మణ సహిత పంచముఖ అంజనేయస్వామి ఆలయంలో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి శ్రీసీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. హైదరాబాద్‌కు చెందిన ఆగమ పండితులు కొడమసింహం భరద్వాజ్ ఆచార్యుల యాజ్ఞికంలో ముడుంబై వెంకటాచార్యులు సేవాకాలం, చక్రవర్తుల సంతోష్ కుమారాచార్యులు వ్యాఖ్యానం, నల్లాన్ చక్రవర్తుల వాసుదేవ ఫణిల గానంతో స్వామివారి కల్యాణం జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అంజేశారు. ఆలయ ప్రధానార్చకులు రమణ, రఘు స్వాముల ఆధ్వర్యంలో శ్రీ సీతారామ కల్యాణ ఉత్సవ కమిటీ, శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సేవా సమితి సభ్యులు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

వైభవంగా గంగానమ్మ, పెద్దింటమ్మ జాతర


కాళింగగూడెంలో జాతరలో జలాభిషేకానికి తరలివెళుతున్న మహిళలు


కాళింగగూడెంలోని అమ్మవారిని దర్శించుకుంటున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఆకివీడు: మండలంలోని కాళింగగూడెంలో గంగానమ్మ, పెద్దింటి అమ్మవార్ల జాతర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించి, అనంతరం గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు బిందెలతో జలాన్ని తీసుకుని ప్రదర్శనగా ఆలయానికి చేరుకున్నారు. ముగ్రాట పాడుకున్న బొడ్డుపల్లి అప్పనపల్లి కుటుంబం, బొడ్డుపల్లి శ్రీనివాస్ (గెటప్ శ్రీను) కుటుంబం తొలుత అమ్మవారికి జలాభిషేకం చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మహిళలు బిందెలతో తీసుకువచ్చిన జలాన్ని అమ్మవార్లకు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా అమ్మవార్లను దర్శించుకున్న పీవీఎల్ మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతోషాలతో జీవించే విధంగా గ్రామదేవతల ఆశీస్సుల కోసం జాతరలు జరపడం ఆనవాయితీగా వస్తోందన్నారు. గ్రామ దేవతల్ని శాంతింపజేయడంతో చెడు ప్రభావాలు పోతాయన్నారు. అమ్మవార్ల ఆశీస్సులతో కొల్లేరు తీరంలోని కాళింగగూడెం దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. ముగ్రాట పాడుకున్న గెటప్ శ్రీను మాట్లాడుతూ కొల్లేరు తీరంలో ఏటా వరదలకు ఈ ప్రాంతం జలమయమయ్యేదని చెప్పారు. శ్రీకాకుళం ప్రాంతం నుంచి వలస వచ్చిన కాళింగులంతా ఓల్డ్ వయ్యేరు కాలువ గట్టు ప్రాంతంలో నివసిస్తూ ఇక్కడ కాళింగగూడెంగా గ్రామాన్ని ఏర్పరుచుకున్నామని చెప్పారు. సుమారు 50 ఏళ్ల క్రితం వరదలకు పాడి పంటలే కాకుండా ప్రాణనష్టం కూడా జరుగుతుండటంతో ప్రజలు గంగానమ్మ, పెద్దింటి అమ్మను కొలుస్తూ వచ్చారు. ఏటా అమ్మవార్లకు పెద్ద ఎత్తున జాతర చేస్తుండటంతో గంగానమ్మ శాంతించిందని గెటప్ శ్రీను చెప్పారు. ఈ సందర్భంగా పీవీఎల్ నర్సింహరాజును, నాయకులను గ్రామానికి చెందిన మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కిల్లి రామకృష్ణ సత్కరించారు. గెటప్ శ్రీనును పీవీఎల్ సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గురువెల్లి అన్నపూర్ణ, ఎంపీటీసీ సభ్యులు బొడ్డుపల్లి రోహిణీ, హనుమంతు మధుసూదనరావు, సనపన నాగరాజు, మూల జగదీష్, గుంట వెంకటేశ్వరరావు, పమిడి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు జగ్గురోతు విజయ్‌కుమార్, తంగి పుష్కరరావు, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, సంద్యాల సీతారామయ్య, గుండుగొలను ధనరాజు, జామి శ్రీనివాస్, షేక్ హుస్సేన్, తోట శివాజీ, చిట్టిబాబు పాల్గొన్నారు.

సత్తెమ్మ తల్లిని దర్శించిన నాయకులు


పీవీఎల్‌ను సత్కరిస్తున్న సత్తెమ్మ తల్లి జాతర నిర్వాహకులు

ఉండి: పెదపుల్లేరు గ్రామ దేవత సత్తెమ్మ అమ్మవారి 58వ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పంచామృతాలతో నిండిన 108 కలశాలతో గ్రామ ఆడపడుచులు ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, టీటీడీ మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆలయ మర్యాదలతో వారిని స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా పీవీఎల్, సర్రాజు, రామరాజు మాట్లాడుతూ ఏటా పెదపుల్లేరు సత్తెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు. జాతరలో పాల్గొనేందుకు అనేక గ్రామాల నుంచి భక్తులు విచ్చేయడమే కాకుండా గ్రామానికి చెందిన ఆడపడుచులు ఏ ప్రాంతంలో ఉన్నా తప్పకుండా జాతరకు రావడం ఆనవాయితీ అన్నారు. సత్తెమ్మ అమ్మవారి చల్లని చూపు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. సత్తెమ్మ అమ్మవారి దేవస్థాన కమిటీ సభ్యులు, జాతర నిర్వాహకులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న పాతపాటి సర్రాజు


అమ్మవారిని దర్శించుకుంటున్న గోకరాజు రామరాజు

వాలీబాల్ క్రీడాకారులకు కిట్ల పంపిణీ


పాలకోడేరులో వాలీబాల్ క్రీడాకారిణికి డ్రెస్, కిట్ అందజేస్తున్న పీవీఎల్ నర్సింహరాజు

పాలకోడేరు: జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు కోరారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపికై పాలకోడేరు జెడ్పీ హైస్కూల్‌లోని కోచింగ్ క్యాంప్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ఆదివారం పీవీఎల్ నర్సింహరాజు డ్రెస్, కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనపరుస్తూ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. గాదిరాజు నారాయణరాజు ఆశయ సాధనకు అనుగుణంగా నారాయణరాజు కుమారుడు పవన్‌కుమార్ రాజు సహకారంతో క్రీడాకారులకు శిక్షణ, వసతి కల్పించారని, త్వరలో అసోం రాష్ట్రం గౌహతిలో జరిగే 71వ సీనియర్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు క్రీడాకారులకు హాజరవుతున్నారన్నారు. ఎంపీపీ భూపతి రాజు చంటి రాజు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, సర్పంచ్ ఇంజేటి మరియమ్మ, దెందుకూరి వెంకటరాజు, కొత్తపల్లి స్వాతి కునాధరాజు వెంకట నాగలక్ష్మి, వైస్ ఎంపీపీ ఆడాడ లక్ష్మి తులసి, కునాదరాజు కృష్ణంరాజు, పాలా రాధాకృష్ణ పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి భూమి పూజ

పాలకోడేరు: ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. పాలకోడేరులోని రెండో వార్డు, ఐదో వార్డు, గరువు ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు ఆదివారం పీవీఎల్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకోడేరు సచివాలయ పరిధిలోని రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసిందన్నారు. తూర్పు పేటలో రూ.10 లక్షలు, కొత్తపేట గరువు ప్రాంతంలో రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, సర్పంచ్ ఇంజేటి మరియమ్మ, ఉప సర్పంచ్ దెందుకూరి వెంకటరాజు, వైస్ ఎంపీపీ ఆడాడ లక్ష్మి తులసి, ఎంపీటీసీ సభ్యులు కొత్తపల్లి స్వాతి, కునాధరాజు వెంకట నాగలక్ష్మి, గొట్టుముక్కల గోపాలకృష్ణంరాజు, కునాధరాజు కృష్ణంరాజు, దొడ్డి యోహాను, పెన్మెత్స నరసింహారాజు పాల్గొన్నారు.

ప్రాణత్యాగంతో లోకానికి శాంతిమార్గం

పెనుగొండ: హింసకు తావివ్వకుండా ప్రాణత్యాగాన్ని చేసి లోకానికి శాంతి మార్గాన్ని చూపి వాసవీ కన్యకపరమేశ్వరి విశ్వమాత అయిందని బెంగుళూరుకు చెందిన ప్రముఖ ప్రవచనకారుడు నండూరు శ్రీనివాస్ అన్నారు. వాసవీ శాంతిధాంలోని పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన నాలుగో వార్షికోత్సవాల సందర్భంగా ఆదివారం వాసవీ మాతను దర్శించుకుని అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. వాసవీ జన్మస్థలమైన పెనుగొండలో 90 అడుగుల పంచలోహ విగ్రహం నెలకొల్పడం అభినందనీయమన్నారు. ఇంతటి విగ్రహం ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. దీంతో పెనుగొండలో అధ్యాత్మిక శోభ విరాజిల్లుతోందన్నారు. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గోవిందరాజులు నండూరి శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. కోట్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేఆర్ కృష్ణ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం కొత్త కార్యవర్గం ఎన్నిక



ఆకివీడు ఆర్యవైశ్య నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దృశ్యం

ఆకివీడు: సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముందున్నారని ద్వారకాతిరుమల క్షేత్ర వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండప ట్రస్టు అధ్యక్షులు బొండాడ రామమోహనరావు, ధార్మిక పరిషత్ డైరెక్టర్ వెలగ శ్రీరామచంద్రమూర్తి అన్నారు. ఆకివీడు ఆర్యవైశ్య సంఘ నూతన కమిటీ ప్రమాణస్వీకారం ఆదివారం ఆర్యవైశ్య కల్యాణమండపంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వారు పాల్గొని మాట్లాడారు. అన్ని రంగాల్లో ఆర్యవైశ్యులు అభివృద్ధి చెందుతున్నారని చెప్పారు. నూతన కమిటీ అధ్యక్షులుగా గొంట్లా గణపతి, ప్రధాన కార్యదర్శిగా సన్నిధి రామ వెంకటేశ్వరరావు (వెంకన్నబాబు), కోశాధికారిగా గుర్రం ఈశ్వరరావులతో పాటు నూతన కమిటీ ఏర్పడింది. కార్యక్రమంలో నేరెళ్ల రామచెంచయ్య, ఓలేటి శ్రీనివాసరావు, చొప్పెర్ల కనక లింగేశ్వరగుప్తా, గుర్రం లక్ష్మణరావు, పేరూరి రాధాకృష్ణ, సన్నిధి రామ వెంకటేశ్వరరావు, పలువురు ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన 2023 క్యాలెండర్‌ను యూనియన్ బ్యాంక్ భీమవరం రీజినల్ మేనేజర్, డీజీఎం ఎంఎస్ రామారావు స్థానిక బ్యాంక్ బ్రాంచిలో ఆవిష్కరించారు. అసోసియేషన్ నాయకులు అమర్, సునీల్, చీఫ్ మేనేజర్ రామమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్

పాలకొల్లు సెంట్రల్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు భవిష్యత్‌లో వివిధ పోటీ పరీక్షలకు ఒక నమూనాగా ఈ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌లు ఉపయోగపడతాయని బీఆర్ఆర్ అండ్ జీకేఆర్ డిగ్రీ అండ్ పీజీ చాంబర్స్ కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహరావు తెలిపారు. ఆదివారం కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించారు. నరసింహరావు మాట్లాడుతూ ఇంటర్‌లో 90 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు ఫీజులో పూర్తి రాయితీ ఇస్తామన్నారు. అలాగే ఈ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ ప్రోత్సాహకాలు సుమారు రెండు లక్షల రూపాయల వరకూ ఉంటాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఓల్గా, సెక్రటరీ దేవరపు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.